
# కంటికి రెప్పలా కాపాడుతుంది కేసీఆరే

- కారుణ్య ఉద్యోగాలు ఆయన ఘనతే..
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- కారు గుర్తుకు ఓటేయాలని పిలుపు

గోదావరిఖని, అక్టోబర్ 25: కార్మికులను కంటికి రెప్పలా కాపాడుతున్నది సీఎం కేసీఆరేనని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. జీడీకే1వ గనిపై బుధవారం గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించిన ఘనత సీఎం కే దక్కుతుందన్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే సింగరేణి గనులకు మనుగడ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించి కేసీఆర్‌ను సీఎం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాకే దాదాపు 20 వేల మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్మికులను ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసినా పార్లమెంట్‌లో ఆమోదించలేదన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే కేంద్రం మెడలు వంచైనా కార్మికుల ఐటీ రద్దుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ విముఖత చూపడంతోనే ప్రైవేట్ సంస్థలు సింగరేణికి చెందిన గనులను వేలంలో దక్కించుకునేందుకు ముందుకు రావడం లేదని చెప్పారు. ఈ ప్రాంత నిరుద్యోగుల కోసం 30 కోట్లతో ఐటీ పార్కు నిర్మిస్తామని హామీనిచ్చారు. సింగరేణి మెడికల్ కళాశాలలో కార్మికుల పిల్లల కోసం 5 శాతం రిజర్వేషన్లు, కార్మికుల కోసం ప్రత్యేక వార్డు హక్కుగా సాధించుకోనున్నట్లు చెప్పారు. నాయకులు కెంగర్ల మల్లయ్య, జాహిద్ పాషా, కనకం శ్యాంసన్, మారుతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సింగరేణి డైరెక్టర్ (ఫా, ఫైనాన్స్) బలరామ్‌ను పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## డైరెక్టర్‌కు పరామర్శ

శ్రీరాంపూర్, అక్టోబర్ 25: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్, పా) ఎన్ బలరామ్‌ను బుధవారం కలిసి టీబీజీకేఎస్ నాయకులు కలిసి పరామర్శించారు. డైరెక్టర్ బలరామ్ తండ్రి హుణ్యానాయక్ ఇటీవల మృతి చెందారు. తన స్వగ్రామం తిరుమలగిరికాలనీ బాలానగర్ తండాలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, మేడిపెల్లి సంపత్ డైరెక్టర్ బలరామ్ తండ్రి దశదిన కర్మకు హాజరై పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్, ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మన్, కుమారస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి తొంగల రమేశ్, అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలు

రామగిరి, అక్టోబర్ 25: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏఎల్‌పీ, డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలను రెండు రోజుల పాటు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించబడుతాయని అధికార ప్రతినిధి ముప్పిడి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో సింగరేణిలోని అన్ని రీజియన్ల క్రీడాకారులు పాల్గొంటారని , ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం కే.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## జీడీకే-2వ గని తనిఖీ

గోదావరిఖని, అక్టోబర్ 25: ఆర్జీ-1 ఏరియా జీడీకే-2వ గనిని బుధవారం జీఎం చింతల శ్రీనివాస్ తనిఖీ చేశారు. గనిలో ప్యానెల్‌కు సంబంధించి రక్షణ సూచనలు ఇవ్వడంతోపాటు ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించారు. అదేవిధంగా భవిష్యత్‌లో గనికి సంబంధించి ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. 2,2ఏ గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఏజెంట్ చంద్రశేఖర్, మేనేజర్ తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మాధవ రెడ్డి, దామోదర్, తదితరులున్నారు.

# కాంగ్రెస్‌ది కపట ప్రేమ

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య

గోదావరిఖని, అక్టోబర్ 25: కపట ప్రేమను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ఒకవైపు కల్లబొల్లి మాటలు మరోవైపు ఫిర్యాదులు అని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య ఆరోపించారు. విజయ దశమి రోజున కార్మికులంతా ఆహ్లాదంగా రాంలీలా ఉత్సవాలను జరుపుకోకూడదని ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు స్థానిక సెంటినరీకాలనీ రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఆహ్లాదకరంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల మంథని అభ్యర్థి పుట్ట మధు పర్యవేక్షణలో జరిగేలా రాంలీలా కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ నేపంతో జరగకుండా నిలిపివేయాలని కపట బుద్ధితో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కార్మికుల ఆనందాన్ని ఓర్వలేని కాంగ్రెస్ సెంటినరీకాలనీ ప్రతి సంవత్సరం గత కొంత కాలం నుంచి రాం లీలా ఉత్సవాలను ఘనంగా జరుపుకునే సంప్రదాయాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీలోని రాణీ రుద్రమదేవి స్టేడియంలో జరిపే రాంలీలా ఉత్సవాలకు ప్రస్తుత జడ్పీటీసీ పుట్ట మధు ముఖ్యఅతిథిగా హాజరై ఘనంగా రాంలీలా ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో సంబంధిత అధికారుల అన్ని అనుమతులతో నిర్వహించే రాంలీ లా ఉత్సవాలకు సెంటినరీకాలనీలోని కార్మికుల కుటుంబాలే కాకుండా పరిసర ప్రాంత ప్రజలు కూడా వేల సంఖ్యలో హాజరై ఆనందంగా జరుపుకుంటారని చెప్పారు. కానీ, ఈ సంవత్సరం కాంగ్రెస్‌కు నాయకులు రాంలీ లా ఉత్సవాలను అడుగడుగునా అడ్డుకోవడమే కాకుండా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు

## ముమ్మరంగా తనిఖీలు



జంగాంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సందీప్‌కుమార్ ,సిబ్బంది

జైనూర్,అక్టోబర్ 25: మండలంలోని జంగాం ఎన్నికలచెక్ పోస్ట్ వద్ద బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో మండలంలోని జంగాం అశపెలి చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలి స్తున్నారు. తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్ లైసెన్సు, బండి కాగితాలపై ఆరా తీస్తున్నారు.అనుమతులు లేని డబ్బులు ఎవరైనా తీసుకొని వెళ్తితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోఎస్ఐ సందీప్ కుమార్ ,పోలీసులు ఉన్నారు.

## అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న పలు గ్రామాల సార్‌మేడీలు

జైనూర్,అక్టోబర్ 25: దండారి పండుగకి అర్హులైన గ్రామ పటేల్‌లు దరఖాస్తు చేసుకోవాలని మార్లవాయి సార్ మేడి జుగ్నక దేవరావ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలకు, దేవుళ్లకు పెద్దపీట వేస్తున్నదన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆదివాసుల గ్రామాల్లో దండారి పండుగను పురస్కరించుకొని ఐటీడీఏ ద్వారా పండుగకు రూ.10వేల చెక్కు అందిస్తారన్నారు. గ్రామాల పటేల్‌లు తమ తమ గ్రామానికి చెందిన ఆకాడీ పెన్ ఉన్న గ్రామ పటేలు తమ యొక్క ఆధార్ కార్డు, అకౌంట్ జిరాక్స్ చిరునామా తీసుకుని రాయి సెంటర్ సార్ మేడిల వద్ద అందించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆదివాసీ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మారవాయి సార్‌మేడి జుగ్నక దేవరావ్, మహగావ్ సార్ మేడి ఆత్ర ఆనందరావ్, లేండిజాల సార్ మేడి మేస్రం బాదిరావ్, మర్లవాయి ఉపసార్‌మేడి ప్రకాశ్, ఆదివాసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుక్షణం భద్రతతో పని చేయాలి

- రామగుండం జీఎం సేఫ్టీ సాంబయ్య

రామగిరి, అక్టోబర్ 25: గనిలో విధులు నిర్వహిస్తున్నప్పుడు అనుక్షణం భద్రతతో పని చేయాలని సేఫ్టీ జీఎం కే.గురువయ్య అన్నారు. ఆయన బుధవారం రామగుండం సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావులతో కలిసి ఏఎల్‌పీ గనిని సందర్శించారు. రక్షణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పని స్థలాల వద్ద ఉద్యోగులతో మాట్లాడి రక్షణపై తీసుకుంటున్న జాగ్రత్త చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచ్ ఎంట్రీల పని స్థలాలను పరిశీలించారు. సేఫ్టీ జీఎం మాట్లాడుతూ.. పని స్థలాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, భద్రతతో కూడిన విధులు నిర్వహించాలని పలు సలహాలు, సూచనలు చేశారు. ఇక్కడ ఆయనతోపాటు అధికారులు నాగేశ్వరరావు, కే.రాజేందర్, ఇంజినీర్లు రఘురాం, నాగరాజు, సూపరింటెండెంట్ కే.జనార్దన్ ఉన్నారు.



ఏఎల్‌పీ గనిని సందర్శించిన ఉన్నతాధికారులు